క్లుప్తంగా

అన్న క్యాంటిన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలోని అన్న క్యాంటీన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మార్కెట్ యార్డు, మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న, ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద అన్న క్యాంటీన్‌లను ఆయన గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పోల్స్‌కు ఫ్లెక్సీలు కడితే చర్యలు

రోడ్డు డివైడర్‌ల మధ్య ఉన్న పోల్స్‌కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలో అనధికార ఫ్లెక్సీలను దాదాపు తొలగించామని తెలిపారు. డివైడర్‌లకు వాటిని ఏర్పాటు చేయటం వల్ల పలువురు ప్రమాదాల బారిన పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎవ్వరు వాటికి ఫ్లెక్సీలు కట్టవద్దని సూచించారు.

స్వధార్ హోంలో అన్నదానం



తెనాలి అర్బన్: ప్రవాస భారతీయుడు పి సాంబశివరావు పుట్టిన రోజును పురస్కరించుకుని కొత్తపల్లి కృష్ణమోహన్, ఈదర వెంకట పూర్ణచంద్ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం జేఎంజే స్వధార్ హోంలోని నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను వారు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగలకుదురు గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, ఈదర శ్రీనివాసరావు, కాకుమాను ఉపేంద్ర, కొత్తపల్లి వెంకట్, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళీ, గుమ్మడి సరోజప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొసరాజు అండ్ కొలసాని చారిటబుల్ ట్రస్ట్ ఆవిర్భావం



తెనాలి: పట్టణంలో మరో స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటైంది. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీలో బోటనీ విభాగ అధిపతిగా రిటైరైన కొసరాజు వెంకట్రావు ఆధ్వర్యంలో 'కొసరాజు అండ్ కొలసాని చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటైంది. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ చాంబరులో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ట్రస్ట్ ఏర్పాటు, లక్ష్యాలను వివరించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, మానవత సంస్థ, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా, కొసరాజు వెంకట్రావు కార్యదర్శిగా వ్యవహరిస్తారు. కొసరాజు ఝాన్సీకుమారి, కొలసాని మాధవి, చిట్టినేని సాంబశివరావు, పాపోలు వెంకటేశ్వరరావు, ఎస్వీ శర్మ ట్రస్టీలుగా ఉంటారు. తన వంతుగా మనవడు చైతన్యమోహన్ జ్ఞాపకార్థం ట్రస్టుకు విరాళంగా రూ.10 లక్షల చెక్కును కొసరాజు వెంకట్రావు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రామ్‌చంద్‌కు అందజేశారు. ఆ మొత్తాన్ని ట్రస్ట్ ఖాతాలో జమచేసి, ఇతర విరాళాలతో సహా వచ్చే ఆదాయాన్ని నిరుద్యోగుల ఉపాధి కల్పనకు అవసరమైన నైపుణ్య శిక్షణ కల్పించటం, స్కూలుస్థాయిలోనే పేద విద్యార్థులను దత్తత తీసుకుని, వారి చదువుకు తోడ్పాటు నివ్వాలనేది ట్రస్ట్ ఆశయాలుగా వివరించారు. ప్రవాస భారతీయుల సహకారం కూడా తీసుకుంటామని వివరించారు. విలేకరుల సమావేశంలో ట్రస్టీలు కూడా పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యం



గుంటూరు మెడికల్: ఏపీ అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రతి పేదవాడికి అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఆర్.అగ్రహారం, రావు బహదూర్ వీధి, శివాలయం వీధి, నరసింహ స్వామి కోవెల ఏరియాలో గురువారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానంలో భాగంగా ఇంటికి వెళ్లి ఉదయాన్నే రూ.4వేలను లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉడతా నరసింహారావు, కూనిశెట్టి చంద్రశేఖర్, పద్మనాభం, జనసేన నాయకులు రాజా, రమణ పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు..పూడ్చడం మరిచారు



గుంతలపై వాహనదారుల అవస్థలు



గుంతలపై ఏర్పాటు చేసిన ముళ్లకంప

- రక్షిత నీటి పైపులైన్ కోసం తవ్విన గుంతలు
- పూడ్చని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో రక్షిత నీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం గుంతలు తవ్వారు. కానీ కాంట్రాక్టర్ వాటిని పూడ్చటం మరిచారు. దీంతో రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. వాహనదారులు తరచూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేగాక వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. తెనాలి పట్టణంలో సుమారు 1.60 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. వీరు కాకుండా తెనాలి పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వేమూరు, మంగళగిరి, రేపల్లె నియోజకవర్గాలకు చెందిన సుమారు 10వేల మంది ప్రజలకు ఇక్కడికి ప్రతి రోజూ వస్తుంటారు. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న తెనాలి పట్టణంలో గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో తెనాలి పట్టణానికి రూ.100 కోట్లతో రక్షిత నీటి పథకాన్ని మంజూరు చేశారు. ఆ సమయంలో పట్టణంలోని దాదాపు అన్ని వార్డులలో రక్షిత నీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం రోడ్లు తవ్వారు. తర్వాత కొన్ని గుంతలను సదరు కాంట్రాక్టర్ పూడ్చి మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. ఆ తర్వాత అమృత పథకం ద్వారా కుళాయి కనెక్షన్‌లు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో కూడా కొన్ని రోడ్లను పగులకొట్టి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. వాటిని అలాగే వదిలేశారు. వీటికి మరమ్మతులు చేయాలని కౌన్సిలర్‌లు పలు కౌన్సిల్ సమావేశాలలో కోరుతూ వచ్చారు. కానీ ఆ దిశగా అధికారులు అడుగులు వేయలేదు.

ప్రమాదభరితంగా రహదారులు

తెనాలి పట్టణంలోని ఆర్ఆర్ నగర్, మారీసుపేట రెండు గేట్ల మధ్య, చంద్రబాబు నాయుడు కాలనీ, బాలాజీరావు పేట, అయితానగర్, నందులపేట, నాజరుపేట వంటి ప్రాంతాలలో పైప్‌లైన్ల మరమత్తుల కోసం ఇటీవల రోడ్లను తవ్వి వాటిని ఏర్పాటు చేశారు. కానీ నేటికి వాటిని పూడ్చటం మరిచారు. దీంతో అవి ప్రమాదభరితంగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు వాటిపై వెళ్తు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. కొన్ని ప్రాంతాలలో స్థానికులు గుంతల వద్ద చెట్ల కొమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పట్టణంలోని రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేయించేలా చర్యలు



అమృత్ పథకం ఫేజ్–2 సమయంలో తెనాలి పట్టణంలోని పలు రోడ్లు తవ్వి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారు. ఆ సయమంలో కాంట్రాక్టర్ గుంతలు కూడా పూడ్చాల్సి ఉంది. కానీ అది జరగలేదు. కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడతాం. త్వరలో గుంతలు పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

–బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్, తెనాలి.

అర్హత ఉన్న ప్రతి పేదవాడికి పింఛన్



తూములూరులో వికలాంగులకు పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

- రెండు నెలల్లో నూతన పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు
- 1వ తేదీనే పింఛన్ల పంపిణీ
- మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర: కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి పేదవాడికి పింఛన్ ఒకటో తేదీనే అందించటం జరుగుతుందని, రానున్న రెండు నెలల్లో నూతన పింఛన్లు, రేషన్ కార్డులు అందించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మండల పరిధిలోని చక్రాయపాలెం, జెముడుపాడు, దావులూరు, తూములూరు, కొల్లిపరలలో గురువారం మంత్రి నాదెండ్ల, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, మండల స్థాయి అధికారులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ ఆగకూడదనే ఆలోచనతో ఒకటో తేదీనే పూర్తిస్థాయిలో పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కొల్లిపర మండలంలో 9,821 మందికి రూ.6 కోట్ల 5వేలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కొల్లిపర మండలంలో సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి రూ.మూడు కోట్లతో నివేదిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించే విషయంలో భాగంగా ప్రతి గ్రామంలో ఉన్న ట్యాంక్‌లను పరిశుభ్రంగా చేయటం, వాటర్ పైప్ లైన్ సరిచేయటం వంటి పనులు త్వరలో మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. అందుకుగాను రూ.1.70 కోట్లతో నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. పింఛన్లు పంపిణీ సమయంలో జెముడుపాడు గ్రామస్తులు డ్రెయిన్‌లు నిర్మించాలని కోరారు. తూములూరు గ్రామంలో పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి, హైస్కూల్‌కి మ్యాథ్స్ టీచర్, రైతులు డొంక రోడ్డులు, అనంతరం మురుగు కాలువ బాగు చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు గ్రామ సమస్యలపై ఇచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాని హామీ ఇచ్చారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గ్రామ సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, కొండా కిషోర్‌రెడ్డి, నూలు చిన్న, అడపా నారాయణరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, అవుతు సుధాకరరెడ్డి, బండి శ్రీనివాసరెడ్డి, కట్టా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



పింఛన్‌ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిరూరల్: తెనాలి మండలం కొలకలూరు, గుడివాడ, కోపల్లె, అంగలకుదురు గ్రామాలలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. వృద్ధులను పేరుపేరునా పలకరిస్తూ వారితో మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీ చేసే సందర్భంగా వృద్ధులు మనోహర్‌ను ఆప్యాయంగా పలకరించారు.

తెనాలి పట్టణంలో 98 శాతం..

తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ తెనాలి పట్టణంలోని 40 వార్డులలో గురువారం ఉదయం ప్రారంభమైంది. ఉదయం ఆరు గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వాటిని పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న పింఛన్‌ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. పింఛన్‌ల పంపిణీని సాయంత్రంలోపు నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం అయిదు గంటలకు 98 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి అయిందని మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణంలోని దాదాపు అన్ని వార్డులలో కౌన్సిలర్‌లు వాటిని పంపిణీ చేశారు.

తహసీల్దార్ గోపాలకృష్ణ బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్‌గా కె.వి.గోపాలకృష్ణ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో వివిధ ప్రాంతాలకు బదిలీలపై వెళ్లిన తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తహసీల్దార్లకు మండలాలను కేటాయించింది. కేవీ గోపాలకృష్ణ తెనాలి తహసీల్దార్‌గా నియమితులయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గోపాలకృష్ణ గతంలో తెనాలి డివిజన్‌లోని కొల్లూరులో ఆర్ఐగా, అమృతలూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి ఉద్యోగోన్నతి పొంది చేబ్రోలు తహసీల్దారుగా కూడా పనిచేశారు. ఎన్నికల సమయంలో ఆయన సూళ్లూరుపేట తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఎన్నికల ముందు నెల్లూరు నుంచి తెనాలి తహసీల్దార్‌గా వచ్చిన శ్రీనివాసరెడ్డి కూడా తాజాగా తిరిగి నెల్లూరుకు వెళ్లారు. ఆయన స్థానంలో కేవీ గోపాలకృష్ణ నియమితులయ్యారు. బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దెల హేనాప్రియ, కార్యాలయ ఉద్యోగులతోపాటు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్, పలువురు వీఆర్వోలు తహసీల్దార్‌ను కలసి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి నిష్పక్షపాతంగా రెవెన్యూ సేవలు అందిస్తానని నూతన తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్ గోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ హేనాప్రియ, ఉద్యోగులు

ఆకట్టుకున్న నాటకాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి పల్నాటి యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. సమతా నాటక గురుకుల వ్యవస్థాపక కార్యదర్శి, కందుకూరి వీరేశలింగం అవార్డు గ్రహీత వరయూరి రామానుజసూరి 14వ సంస్మరణ సందర్భంగా పల్నాటి యుద్ధంలోని నాగమ్మ పూజ సీను, మాంచాల సీను, సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. హరిశ్చంద్రగా అమ్మిశెట్టి రంగారావు, హేమంత్‌కుమార్, నక్షత్రకుడిగా జి.వెంకటేశ్వర్లు, చంద్రమతిగా రత్నజ, వీరబాహుడిగా జి.గురునాథం, కాలకౌశికగా బాబూరావు, శిష్యగా శివయ్య, నాగమ్మ పూజ సీను, మాంచాల సీనులో బాలచంద్రగా ఎం.కుమార్ బాబు, మాంచాలగా లహరి నటించారు. కార్యక్రమాన్ని అమ్మిశెట్టి రంగారావు పర్యవేక్షించారు. చివరిగా కళాకారుల్ని దేవాలయ పాలక మండలి సత్కరించింది.

పట్టపగలు ఇంటిలో చోరీ



కొల్లూరు: పట్టపగలే ఓ ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చిలుమూరులో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చిలుమూరుకు చెందిన నాగిశెట్టి నాగలక్ష్మి భర్త మరణించడంతో తన కుమార్తెను చదివించుకుంటూ జీవనం సాగిస్తోంది. గురువారం ఆమె పొలం పనికి వెళ్లగా, కుమార్తె పాఠశాలకు వెళ్లింది. పాఠశాల నుంచి వచ్చిన కుమార్తె.. ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి దుస్తులు చిందరవందరగా పడేసి ఉండటంతో తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఇంటికి వచ్చి పరిశీలించిన నాగలక్ష్మి బీరువాలో దాచి ఉంచిన సుమారు రూ.80 వేలు విలువ చేసే నగదు, బంగారు పోగులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. 100 నంబరుకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. కొల్లూరు పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి, విచారణ జరుపుతున్నారు.

పంటకాల్వల్లో అవరోధాల తొలగింపు

తెనాలి: పంట కాల్వల్లో పేరుకుపోయిన తూటాకు, గుర్రపు డెక్క తొలగింపు చేపట్టినట్టు కృష్ణా పశ్చిమ డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.మల్లికార్జున చెప్పారు. పంటకాల్వల్లో తూటాకు, గుర్రపు డెక్క విపరీతంగా అల్లుకుపోయిన విషయం తెలిసిందే. ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ పనుల్లో భాగంగా గత వేసవిలో వీటి తొలగింపును చేపట్టాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కారణంగా జాప్యం అనివార్యమైంది. ఇటీవల వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో వెదజల్లిన వరిచేలు నీటమునిగిన విషయం తెలిసిందే. దీనితో రైతుల నుంచి వచ్చిన డిమాండ్లను పురస్కరించుకుని సాగునీటి కాల్వల్లో అవరోధాలను తొలగించేందుకు జలవనరులశాఖ పూనుకుంది. కృష్ణా పశ్చిమడెల్టాలో మొత్తం 83 పనులను గుర్తించారు. మొత్తం రూ.4.83 కోట్ల అంచనాలతో టెండరు పిలిచారు. వీటిలో 74 టెండర్లు ఫైనలైజ్ అయినట్టు ఈఈ మల్లికార్జున చెప్పారు. దాదాపు 90 శాతం పనులు ఆరంభమయ్యాయని తెలిపారు. తూటాకు, గుర్రపు డెక్క, ఇతర అవరోధాలను తొలగించటమే కాకుండా, వచ్చే ఆరునెలల్లో మళ్లీ ఎలాంటి అవరోధాలు వచ్చినా తొలగించే బాధ్యత కూడా సంబంధిత కంట్రాక్టరుదేనని స్పష్టంచేశారు. టెండరు ఒప్పందంలోనే ఆ విషయాన్ని చేర్చటం జరిగిందన్నారు. పశ్చిమ కాల్వలోని వ్యర్థాల తొలగింపును గురువారం ఆయన పరిశీలించారు.



తూటాకు, గుర్రపు డెక్క తొలగింపును పరిశీలిస్తున్న ఈఈ మల్లికార్జున

అనాథ మహిళ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

తెనాలి: ఆమె పేరు గండికోట సావిత్రి...వయసు 75 ఏళ్లు...ఒంటరి జీవితం. ఆలనాపాలనా చూసే వాళ్లు లేక స్థానిక గాంధీనగర్‌లోని పట్టణ పేదల నిరాశ్రయుల ఆశ్రమంలో గడుపుతోంది. కొన్నేళ్లుగా అక్కడ ఆశ్రయం పొందుతున్న ఆ వృద్ధురాలు ఇటీవల అస్వస్థతతో బాధపడుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. అనాథ అయిన సావిత్రి భౌతికకాయానికి అంత్యక్రియలు ఎలాగ? అనుకున్న కేంద్రం నిర్వాహకులకు పట్టణ స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ శివలింగేశ్వర భక్తబృంద సేవా సమితి గుర్తుకొచ్చింది. ఫోన్ చేసిన వెంటనే సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆశ్రమానికి చేరుకున్నారు. సభ్యులతో కలిసి ఆమె భౌతికకాయాన్ని బుర్రిపాలెంరోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. సంప్రదాయం ప్రకారం చివరి సంస్కారాలను నిర్వర్తించారు. మహాప్రస్థానం సేవాసమితి కార్యదర్శి జెట్టి శివరామకృష్ణ వీరి సేవానిరతిని ప్రశంసించారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టటం, అనాథలు, నిస్సహాయులుగా మరణించిన వారికి అంత్యక్రియలు చేస్తున్నామని శ్రీను తెలిపారు. దహన సంస్కారాలు చేసిన వారి అస్తికలను తీసుకుని కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేసి, పిండప్రదానం కూడా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మల్లేల వాసు, పోతురాజు, సంజయ్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



మహాప్రస్థానంలో సావిత్రి భౌతికకాయం వద్ద జెట్టి శివరామకృష్ణ, కుర్రా శ్రీను

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు

తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, బీజేఆర్ కమిటీ సభ్యులు గురువారం పట్టణంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఐతానగర్‌లోని లింగారావు సెంటర్‌కు చేరుకుని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలు వేసి, మంద కృష్ణమాదిగ, ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, బీజేఆర్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ద్వారా దశాబ్దాల నుంచి తాము చేస్తున్న పోరాటానికి న్యాయం జరిగిందని అన్నారు. వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పునివ్వడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, బీజేఆర్ కమిటీ నాయకులు మేకల సురేష్, సుద్దపల్లి నాగరాజు, అత్తోట చంటి, నలుకుర్తి సద్గుణరావు, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్, సిద్దెల కమలాకర్, కొమ్ము రాయల్, చంద్రా వినయ్, చావలి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

ఎస్సీ వర్గీకరణపై సానుకూల తీర్పు రావడం కూటమి ప్రభుత్వ విజయం అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు గురించి వారు మాట్లాడుతూ హర్షం తెలియజేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సోపాటి కిరణ్ అన్నారు. ఇది టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పునివ్వడం సంతోషదాయకమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పినపాటి రవీంద్ర, అత్తోట శరత్, గాజులవర్తి సురేష్, దొప్పలపూడి శ్యామ్, బుల్లా రమేష్, రావూరి ఆనంద్, చావలి రాజేంద్ర ప్రసాద్, కొమ్మూరి వెంకటేశ్వర్లు, ఉన్నం జాన్‌బాబు, కొక్కిలిగడ్డ మనోజ్, తంగిరాల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య వీరయ్య



ఆచార్య వీరయ్యకు అభినందనలు తెలుపుతున్న వీసీ తదితరులు



వీసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఝాన్సీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జువాలజీ విభాగ సీనియర్ అధ్యాపకులు ఆచార్య కె. వీరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం నియామక ఉత్తర్వులు అందజేసి అభినందనలు తెలిపారు. సైన్స్ కళాశాలను విద్య, బోధన, పరిశోధన రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులు ఆయనకు సూచించారు. సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఫిజిక్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య రవికుమార్ నియమితులయ్యారు. అభినందనలు తెలిపిన వారిలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ డైరెక్టర్ ఆచార్య పద్మావతి, ఆచార్య ఎం. త్రిమూర్తిరావు, ఆచార్య సురేష్‌కుమార్ ఉన్నారు.

యూనివర్సిటీని సందర్శించిన ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్. ఝాన్సీ గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలాన్ని కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం యూనివర్సిటీలో విద్యార్థినులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. యూనివర్సిటీలో క్రీడా వసతులు, గ్రంథాలయం, ఫైన్ ఆర్ట్స్ కళాశాల, బొటానికల్ గార్డెన్ తదితర ప్రాంతాల్ని సందర్శించారు. మౌలిక వసతులు పరిశీలించారు. ఆమె వెంట ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మల్లవరపు పవన్ కుమార్, విశ్వవిద్యాలయ అధ్యక్షురాలు డి. హర్షిత, ఇన్‌చార్జ్ మోహన్, సెక్రటరీ మణికంఠ, గుంటూరు టెక్నికల్ సెల్ కన్వీనర్ శివ గణేష్, ఎ. శాంభవి, హేమంత్ రామ్, సాయి, హరీష్, శివ రామరాజు, నానాజీ, భానుప్రకాష్, శ్రీనివాస్, యుగంధర్, దత్త, సిద్ధు, వినయ్, గంగాధర్ ఉన్నారు.

విద్యార్థులకు గొడుగులు, పరీక్ష కిట్ల పంపిణీ



గుంటూరు మెడికల్: గుంటూరు హోప్‌విన్ హాస్పిటల్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో హాస్పిటల్స్ చైర్‌పర్సన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా విద్యార్థులకు ఉచితంగా గొడుగులు, పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకమైందని, ఇందులో సాధించే మార్కుల ఆధారంగా వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులంతా ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేయాలని, చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరరావు, గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ట్రస్టు చైర్మన్ పఠాన్ అల్లాబక్షు, పాఠశాల హెడ్‌మాస్టారు బి.రాజీవ్‌రత్న పాల్గొన్నారు.